కథ

# తెల్లకాగితం....

## తెలిదేవర భానుమూర్తి



ఆమె అందంగా ఉండదు. అజంతా శిల్పంలా ఉండదు. అప్సరసలా ఉండదు. కానీ ఆమె కనుముక్కు తీరు బాగానే ఉంటుంది. చామనఛాయగా ఉన్నా ఆమె మొహంలో ఆకర్షణ ఉంది. ఆమెకు పందొమ్మిదేళ్లు ఉంటాయేమో. పని ఉన్నా లేకున్నా తెలిసినా తెలియకున్నా రోడ్డు మీద వెళ్లే ప్రతివారిని ఆమె పలకరిస్తూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆమె వస్త్రధారణ తమకాన్ని కలిగిస్తూ ఉంటుంది. నేనూ సైనీ మార్నింగ్ వాక్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు రైల్వే బ్రిడ్జి ఎక్కుతూనో, దిగుతూనో ఆమె కనిపిస్తూ ఉంటుంది.

సైనీ నా స్నేహితుడు. అతను తెలుగువాడు కాదు. హర్యానాకు చెందినవాడు. కొద్దికొద్దిగా తెలుగులో మాట్లాడగలడు. అతనికీ నాకూ విచిత్రంగా పరిచయం కలిగింది. రేణుగుంట వచ్చిన మొదట్లో మేము సైనీ ఇంటి ముందుండేవాళ్లం. మా పిల్లలు అతని ఇంటికి వెళ్లేవారు. హిందీలో కబుర్లు చెప్పేవారు. హిందీలో మాట్లాడేవారు దొరకడంతో అతను కూడా మా పిల్లలతో కాలక్షేపం చేసేవాడు.

"నిన్నెందుకో సైనీ అంకుల్ రమ్మన్నాడు నాన్నా" అని మా చిన్నవెధవ చెప్పాడు.

మా పిల్లలు ఏమైనా కానిపని చేసేరేమో అనే అనుమానం నాకొచ్చింది. భయపడుతూనే సైనీ వద్దకు వెళ్లాను.

"భయ్యా! మా పక్క ఇల్లు ఖాళీ అయ్యింది. మీరందులో దిగితే బాగుంటుంది. ఇక్కడ మాతో హిందీలో మాట్లాడేవాళ్లెవరూ లేరు. నేను ఆఫీసుకు పోతే నా భార్య ఒంటరిగా ఉంటుంది. మీరు మా పక్కింట్లో దిగితే ఆమెకు కాలక్షేపంగా ఉంటుంది" అని సైనీ అన్నాడు.

"సరే" అని అన్నాను.

మేము ఆ ఇంట్లోకి మారడంతో సైనీ కుటుంబంతో మా కుటుంబానికి సన్నిహిత సంబంధాలేర్పడ్డాయి. సైనీ వాళ్లమ్మాయి రింపీ మాఇంట్లో అన్నం తినేది. వాళ్లింట్లో రోజూ రొట్టెలు చేసేవారు. మా వెధవలు రొట్టెలకెగబడేవారు. కొద్దిరోజులయ్యాక మేమంతా ఒకే కుటుంబంలా కలిసిపోయాం. ఎక్కడికెళ్లినా అందరం కలిసి వెళ్లేవాళ్లం. రోజూ పొద్దున్నే వాకింగ్‌కు వెళ్లడం నాకలవాటు. నాతో పాటు రోజూ సైనీ కూడా వాకింగ్‌కు రావడం మొదలుపెట్టాడు. మార్నింగ్ వాక్ కోసమే సైనీ కొత్త బూట్లు కొన్నాడు.

దోమతెరను దించినట్లు పొగమంచు కురుస్తూ ఉంది. మంచులో నల్లటి కొండలు కనిపించడంలేదు. అప్పటికింకా తెల్లవారలేదు. నేనూ, సైనీ మార్నింగ్‌వాక్‌కు బయల్దేరాము. కొద్ది దూరం వెళ్లగానే తమ సామ్రాజ్యంలోకి శత్రువులు వచ్చారని తెలుపుతూ ఒక కుక్క భౌభౌమంది. దాని వెంట ఉన్న కుక్కలు అందుకు వంతపాడాయి. విమానాశ్రయానికి వెళ్లే రోడ్డు మీద మేము వాకింగ్ చేస్తుంటాము. ఆ రోడ్డు అంటే నాకు ఇష్టం. అందుక్కారణం లేకపోలేదు. ఆరోడ్డు ప్రశాంతంగా ఉంటుంది. ఆ రోడ్డు మీద వాహనాల రాకపోకలు అంతగా ఉండవు. గతుకులు లేని ఆ రోడ్డు కిరుపక్కలా వరుసగా వేపచెట్లుంటాయి.

మేము మార్నింగ్‌వాక్ నుంచి తిరిగివచ్చేటప్పుడు లేలేత కిరణాలతో సూర్యుడు స్వాగతం పలుకుతుంటాడు. పల్లెటూళ్ల నుంచి పాలు పోయడానికి సైకిళ్ల మీద వచ్చేవారు ఎదురవుతుంటారు. రైల్వేస్టేషన్ వద్ద టీ అంగళ్లు కలకల్లాడుతుంటాయి. స్టేషన్ ముందు తిరుమలకు వెళ్లే బస్సులు ప్రయాణీకులతో కిటకిటలాడుతుంటాయి.

ఆరోజు మేము రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగుతున్నప్పుడు ఆ అమ్మాయి కనిపించింది.

"భయ్యా ఆమె ఎవరు?" అంటూ సైనీనడిగాను.

"బజారు పిల్ల" అని సైనీ హిందీలో చెప్పాడు.

దాంతో నాకు అతని మీద కోపం వచ్చింది. ఆ అమ్మాయి మిగతా వారికంటే భిన్నంగా

కనిపించవచ్చు. ఆమె వస్త్రధారణ రెచ్చగొట్టే విధంగా ఉండవచ్చు. అంతమాత్రాన ఆమెను బజారుమనిషిగా చూడ్డం ఎంతవరకు సబబు. నీతి సూత్రాలు వల్లించే ప్రతి మగాడూ ఆ అవకాశం దొరికితే అందరికన్నా ముందుం టాడు. రాత్రంతా ఏ ఫ్యాక్టరీలోనో ఆమె పనిచేసి ఉండొచ్చు. లేదా పొద్దుటే ఎవరింట్లోనో అంట్లు తోమడానికి వెళ్తుండ వచ్చు. వాళ్లు బీదవాళ్లు కావచ్చు. ఆమె పని చేస్తే కాని ఇల్లు గడవని పరిస్థితి ఉండొచ్చు. కేవలం బాహ్యరూపాన్ని మాత్రమే చూసి ఒకరి గుణగణాలన్ని ఎలా నిర్ణయిస్తారు? కాలక్షేపానికి ఎదుటివారి మీద దుమ్ము చల్లడం కొందరికి అలవాటు. సైనీకూడా ఆకోవలోకి చెందినవాడేమో!

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లంతా ప్రశాంతంగా ఉంది. మా పిల్లలు ముఖ్యంగా మా చిన్నవెధవ ఇంట్లో లేడేమో ననుకున్నాను. కానీ మా చిన్నవాడు ఇంట్లోనే ఉన్నాడు. జ్వరం రావడాన వాడు మూలుగుతున్నాడు.

"డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లావా?" అని నా భార్యనడిగాను.

"తీసుకెళ్లాను. ఏవో మందులు రాసిచ్చాడు. కానీ అవి ఇక్కడ దొరకలేదు. తిరుపతిలో దొరుకుతాయట" అని నా శ్రీమతి చెప్పింది.

టీ తాగాక డాక్టర్ రాసిచ్చిన చీటీ తీసుకొని తిరుపతికి బయల్దేరాను. రోజూ మార్నింగ్ వాక్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు కనిపించే అమ్మాయి నాకు బస్సులో కనిపించింది. ఆమె పక్కనే ఒక యువకుడు కూర్చుని ఉన్నాడు. ఆ అమ్మాయి మెడలో మంగళసూత్రం ఉంది. అలా ఆమెను చూడగానే నాకు సంతోషం కలిగింది. సైనీమీద కోపం వచ్చింది. నిక్షేపంలాంటి అమ్మాయి మీద నిందలు వేసినందుకు సైనీని చితక తన్నాలనిపించింది. తన భర్త భుజంమీదికి వాలిపోతూ ఆమె కిలకిలా నవ్వుతూ మాట్లాడుతోంది. తిరుపతి వచ్చాక వాళ్లు ఎటో వెళ్లారు. నేను మందులు కొనుక్కొని తిరిగి ఇంటికి వచ్చాను.

కోడికూతతో నాకు మెలకువ వచ్చింది. గడియారం కేసి చూశాను. తెల్లవారుజామున ఐదుగంటలయ్యింది. లేచి బట్టలేసుకున్నాను. తలుపు తీసుకుని రోడ్డు మీద అడుగుపెట్టాను. ఏదో పని ఉండటంతో సైనీ ఢిల్లీ వెళ్లాడు. సైనీ లేకపోయినా నేను మాత్రం మార్నింగ్‌వాక్ మానలేదు. ఒక్కడినే విమానాశ్రయం దాకా నడిచివెళ్లాను. తిరిగి వచ్చేటప్పుడు ఒక వేప్పుల్ల తెంపుకుని దానితో పళ్లు తోముకుంటూ రాసాగాను. రైల్వే స్టేషన్ వచ్చాక నీళ్లతో మొహం కడుక్కున్నాను. మా ఎదురింటి వాళ్ల అమ్మాయి ఎవరో కుర్రాడుతో చెన్నై వెళ్లే రైల్లో కనిపించింది. ఆ అమ్మాయిని అందరూ బుద్ధిమంతురాలని అంటూ ఉంటారు. నోట్లో వేలు పెట్టినా కొరకలేనట్లుగా ఆమె ఉంటుంది. ఆ అబ్బాయి ఎవరో ఏమో! వాళ్ల బంధువుల అబ్బాయి కావొచ్చునని అనుకొన్నాను.

రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగుతున్నాను. బ్రిడ్జి కింద నుంచి అరుపులు వినిపించాయి. ఎవరా అని కుతూహలంతో చూశాను. రోజూ కనిపించే ఆ అమ్మాయి ఒక యువకుడితో పోట్లాడుతూ కనిపించింది.

"ఒళ్లు హూనం చేసుకొనేది నేను. పోలీసులకి పట్టుబడితే జైలుకెళ్లేది నేను. సగానికి సగం ఇవ్వమంటే ఎలా?" అని ఆ అమ్మాయి అంటే - "నేను బేరం తేకపోతే నీకు డబ్బులెలా వచ్చేవి" అని ఆ యువకుడంటున్నాడు.

"నువ్వు బేరం తెస్తే మాత్రం పోలీసులకు పట్టుబడకుండా మెళ్లో మంగళసూత్రం వేసుకొని పెళ్లయినదానిలా నటించింది నేను. అందరి కళ్లు గప్పి సంపాదిస్తే తగుదునమ్మా అంటూ సగానికి సగం ఇవ్వమంటావా? నేనివ్వను. ఏం చెయ్యాలనుకుంటే అదే చెయ్యి" అంటూ ఆ అమ్మాయి పెద్దగా అరుస్తున్నది.

వాళ్ల మాటలతో నాకు విషయం అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు. ఆమెకు పెళ్లయిందనీ ఆమె అందరనుకున్నట్లుగా బజారుమనిషి కాదనీ సంతోషించాను. సైనీ కనబడితే గడ్డి పెడదామనుకున్నాను. కానీ చేదునిజం తెలియడంతో కొద్దిసేపు నా కళ్లు బైర్లు కమ్మాయి. కొండ విరిగి మీద పడినట్లయింది.

భారంగా అడుగులేస్తూ ఇల్లు చేరుకున్నాను. టీ తాగి పేపరు చూస్తూ కూర్చున్నాను. ఎందుకో ఏమో మా వీధంతా గోలగోలగా ఉంది.

"ఏమైంది?" అని నా భార్యను అడిగాను.

"మునుస్వామి కూతురూ కనిపించడం లేదట. అంతే కాదు వరదరాజుల కొడుకూ కూడా రాత్రి నుంచీ కనిపించడంలేదు" అని నా భార్య చెప్పింది.

మునుస్వామి కూతురు వరదరాజుల కొడుకు నాకు చెన్నై రైల్లో కనిపించారని చెప్పాలనుకొన్నాను. కానీ చెప్పలేదు. బుద్ధిమంతురాల్లా నోట్లో నాలుక లేనిదానిలా కనిపించే పిల్ల తన నిజస్వరూపాన్ని చూపెట్టింది. అందరూ బజారు మనిషిగా పరిగణించే అమ్మాయి మాత్రం ఎలాంటి రహస్యాలు లేకుండా స్ఫటికంలా బతుకుతున్నది. అయినా అందరూ ఆ అమ్మాయినే అసహ్యించుకుంటారెందుకో!

■


బుద్ధి మాంద్యులకు
వృత్తి కోర్సులలో ఉచిత శిక్షణ

అడ్మిషన్లు ప్రారంభం

బుద్ధి మాంద్యుల సంరక్షణలో 25 సంవత్సరాలుగా అవిరళ కృషి జరుపుతున్న 'స్వీకార్' వృత్తి కోర్సులలో శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. తమ శిక్షణా విభాగమైన 'ప్రకృతి' లోకి బుద్ధిమాంద్యులనుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

'ప్రకృతి' ప్రాజెక్టు 32 ఎకరాలలో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయబడింది. ఇక్కడ వ్యవసాయ పరిశ్రమలలో శిక్షణ ఇస్తారు. వ్యవసాయము, తోటలు పెంచడం, పాల ఉత్పత్తి (డైరీఫామ్), కోళ్ళఫారాలు, వడ్రంగి పని, కుండలు తయారుచేయడం వంటి పనులు నేర్పించబడును.



శిక్షణకు ఎంపికఅయినవారికి
ఉచిత భోజనం, వసతి కలదు.

నిపుణులచే పూర్తి పరిశీలన జరిపిన తర్వాతనే అడ్మిషన్లు ఇవ్వబడును.



పరిమితమైన సీట్లు

వివరాలకు వెంటనే స్వయంగాకలవండి లేక వ్రాయండి.

SWEEKAR REHABILITATION INSTITUTE FOR HANDICAPPED
Upkaar Complex, Upkaar Junction, Secunderabad-3 A.P. India.
Tel:040-7843338, 7841696, 7814089 Fax: 040-7810731, 7720880
Email:sweekaar@hotmail.com, sweekaar@yahoo.com
Website: www.sweekaar.org